ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 58 | గురువారం 27-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# స్టాలిన్‌కు కేటీఆర్ మద్దతు

హైదరాబాద్,ఫిబ్రవరి26:



నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమర్థించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణ భారత దేశానికి అన్యాయం జరుగుతుందన్న వ్యాఖ్యలకు మద్దతిచ్చారు. దేశానికి అత్యవసరమైనప్పుడు కుటుంబ్ర నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించడం తగదని అన్నారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను పరిగణనలోకి తీసుకోకుండా నియోజకవర్గాల పునర్విభజన చేయడం ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కేటీఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిజంగానే నియోజకవర్గాల పునర్విభన చేయాలని భావిస్తే.. అది దేశానికి అందించే ఆర్థిక సహకారం వాటా ఆధారంగా ఉండాలని ప్రతిపాదించారు. దేశ నిర్మాణానికి తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న కృషిని ఎవరూ విస్మరించలేరని అన్నారు. దేశ జనాభాలో తెలంగాణ జనాభా కేవలం 2.8 శాతం మాత్రమే ఉందని.. కానీ దేశ జీడీపీలో మాత్రం 5.2 శాతం కంటే ఎక్కువ వాటా అందిస్తోందని పేర్కొన్నారు.



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 కు
# అనుమతి ఇవ్వండి
## ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని మంజూరు చేయండి

**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ కు నిధులు ఇవ్వండి**


**రీజినల్ రింగ్ రైల్... డ్రైపోర్ట్‌లు మంజూరు చేయండి**

**సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి**

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26:** హైదరాబాద్ మహా నగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకు అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పదేళ్లుగా హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణపై దృష్టి సారించలేదని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన అయిదు కారిడార్లను ప్రతిపాదించామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు వెంటనే అనుమతిం చాలని అభ్యర్థించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవా రం ఉదయం సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబం ధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూ సేకరణ పూర్తయి నందున ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని వెం టనే మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఉత్తర భాగంతో పాటే దక్షిణ భాగం పూర్తయితే ఆర్‌ఆర్‌ఆర్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకోగలమన్నారు. దక్షిణ భాగం భూ సేకరణకు అయ్యే వ్యయంలో 50 శాతం భరించే ందుకు తాము సిద్ధం గా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రధాన మంత్రికి తెలియ జేశారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని పీఎం మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ రీజినల్ రింగ్ రైలు పూర్తయితే తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోని రైలు మార్గాలతో అనుసంధానత సులభమవుతుందని ప్రధాన మంత్రి మోదీకి రేవంత్‌రెడ్డి తెలియజేశారు.. రీజినల్ రింగ్ రైలుకు అనుమతి ఇవ్వాలని పీఎంను సీఎం కోరారు. సముద్ర మార్గం లేని తెలంగాణకు వస్తువుల ఎగుమతులు, దిగుమ తులు సులువుగా చేసేందుకు రీజినల్ రింగు రోడ్డు సమీ పంలో డ్రైపోర్ట్ అవసరమని, ఆ డ్రైపోర్ట్ నుంచి ఏపీలోని సముద్ర పోర్ట్ లను కలిపేందుకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు తో పాటు రోడ్డును ఆనుకొని రైలు మార్గం మంజూరు చేయాలని ప్రధాన మంత్రి మోదీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మికత మూసీ నదితో ముడిపడి ఉందని రాజధాని హైదరాబాద్ నగరం మధ్యగా మూసీ ప్రవహిస్తోందని.. అంత ప్రాధాన్యం ఉన్న మూసీ పునరుజ్జీవనానికి సహకరించాలని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

## సొరంగంలో రెండ్రోజుల్లో
# ఆపరేషన్ పూర్తి
**నిపుణులు అదేపనిలో ఉన్నారన్న ఉత్తమ్**



**హైదరాబాద్,ఫిబ్రవరి26:**
ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సొరంగమార్గంలో చిక్కుకున్న 8 మందిని కాపాడేందుకు .. రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాద స్థలికి చేరుకునేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు వివరించారు. దేశ సరిహద్దుల్లో టన్నెల్స్ నిర్మించే నిపుణులు, ఎక్కడ టన్నెల్ ప్రమాదం జరిగినా సహాయక చర్యల్లో పాల్గొన్న ఎక్స్‌పర్ట్స్‌ను తీసుకొచ్చి వారి సాయం తీసుకుంటు న్నామని తెలిపారు. 'సహాయక చర్యలు మరింత వేగవంతం చేస్తున్నాం. గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి దెబ్బతిన్న టీబీఎంను వేరు చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పూడికలోకి వెళ్లాలని నిర్ణయించాం. మట్టి, నీరుతో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. ప్రకృతి విపత్తును రాజకీయం చేసి లబ్దిపొందాలనుకునే వారి గురించి నేను మాట్లాడదల్చుకోలేదు. దేశ.. విదేశాల్లో ఉన్న టన్నెల్ ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ముందుకెళ్తున్నాం. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని కాపాడటమే మా లక్ష్యం అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## వేములవాడలో
# శివరాత్రి సందడి

**- భారీగా తరలివచ్చిన భక్తజనం**

**- స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన బండి - రాజన్న సేవలో ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్**



**వేములవాడ,ఫిబ్రవరి26:**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోడె మొక్కులు సమర్పించుకుని.. రాజన్న దర్శనం చేసుకున్నారు. శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. రాజన్న దర్శనం అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ 'మహా శివరాత్రి సందర్భంగా రాజన్నను దర్శనం చేసుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. దక్షిణ కాశీగా పిలువబడే రాజన్న ఆలయానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి కూడా భక్తులు వస్తున్నారు. రాజన్న ఆలయం మోస్ట్ పవర్ ఫుల్. దేశ ప్రధాని వేములవాడ రాజన్నను దర్శనం చేసుకున్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా ఒక చర్చ కొనసాగుతుంది. ప్రధాని దర్శనం నుండి దేశ ప్రజలు కూడా వేములవాడకి వెళ్లానుకుంటు న్నారు. మహాశివరాత్రి ఏర్పాట్లు చాలా బాగున్నాయి. ఈఓ, సిబ్బంది, సేవ సంస్థలను అభినందిస్తు న్నాను. ఇదే స్ఫూర్తితో చివరివరకు భక్తులకు సౌకర్యాలు కొనసాగించాలని సూచించారు. వేములవాడ రాజన్న ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. భక్తులు ప్రధాన ఆలయంలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. దాంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అర్ధరాత్రి నుంచే క్యూలో 6 గంటల పాటు వేచి ఉన్నప్పటికీ దర్శనం కాలేదని, ప్రధాన ఆలయంలోకి అనుమతించలేదని కొందరు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజన్న దర్శనం కాకుండానే శిఖర దర్శనం చేసుకున్నట్లు తెలిపారు. వీఐపీలు, అధికారులు అధిక సంఖ్యలో బంధువులకు నేరుగా దర్శనం చేయిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారికి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనాలను అందించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శివరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇవో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వామి వారి దివేనతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

## దోషులుగా తేలిన నేతలపై
# జీవిత కాలం నిషేధం

**సుప్రీంలో కేసుపై స్పందించిన కేంద్రం**

**అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్న కేంద్రం**

**కేవలం ఆరేళ్ల నిషేధం సరిపోతందని నివేదిక**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26:** వివిధ కేసుల్లో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాల నిషేధాన్ని విధించాలన్న అభ్యర్థను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ కేసులో సదరు వ్యక్తిపై ఆరేళ్ల పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది కఠినతరమని పేర్కొంది. అయితే రాజకీయ నేతలపై జీవిత కాల నిషేధం ఎన్నేళ్లు అనే దానిపై నిర్ణయాధికారం పార్లమెంట్‌దేనని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఖరాకండిగా తేల్చి చెప్పింది. దోషులుగా రుజువు అయితే జీవితకాల నిషేధాన్ని విధించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం తన అభిప్రాయాన్ని వివరిస్తూ.. సుప్రీంకోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు కోరింది. ఆ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.

# నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు

**ఏడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ ఏర్పాట్లు**

**హైదరాబాద్,ఫిబ్రవరి26:**
తెలంగాణలో 27న జరుగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి.

ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు.విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడూతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్టిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు.

వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷-రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. స్టాం÷-రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

# సెయింట్ ఫ్రాన్సిస్ అక్షర ఉన్నత పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు

### హాజరైన చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**తొలి సమయం వరంగల్ జిల్లా ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 26:** హన్మకొండలోని సెయింట్ ఫ్రాన్సిస్ అక్షర ఉన్నత పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఆయిల్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా గత 20 సంవత్సరాల నుండి ఏ విధమైనటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా విద్యాసంస్థలను నడిపిస్తున్న నవీన్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు ధన్యవాదాలు. విద్యార్థులను స్కూల్లో ఉపాధ్యాయులు విద్య బోధన చేసి ఒక క్రమశిక్షణ నేర్పి సమాజానికి ఉపయోగపడే ఒక ఉన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల శ్రద్ధ వహించు వారిని చరవానికి సెల్ ఫోన్ దూరంగా ఉంచవలసిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉంటుందని, సెల్ ఫోన్ ద్వారా పిల్లలకు ఉపయోగపడేది ఒక శాతం అయితే.... దానివల్ల మూడు శాతం వరకు పిల్లలు చెడిపోయే విధంగా ఉపయోగపడుతుంది. కనుక దయచేసి ముఖ్యంగా ఆడపిల్లల తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఏ పనికైనా విరామం ఉంటుంది కానీ ఉపాధ్యాయ వృత్తికి మాత్రం ఉండదు. అలాంటి వృత్తిని ఎన్నుకొని ఎంతోమంది మేధావులను తీర్చిదిద్దుతున్న నవీన్ రెడ్డి దంపతులు ఇంకా రానున్న రోజుల్లో ఎంతోమంది మేధావులను తీర్చిదిద్దాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన అన్నారు.

# శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

**- భక్తులతో కిటికిటలాడిన శివాలయాలు**

**- వేయి స్తంభాల ఆలయంలో ఎంపీ కడియం కావ్య ప్రత్యేక పూజలు**





**తొలి సమయం వరంగల్ బ్యూరో చీఫ్:** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శివాలయాల్లో శివ భక్తులు శివనామ స్వరాల నామంతో నగారా మోగించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పవిత్ర మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చారిత్రాత్మకమైన వెయ్యి స్తంభాల ఆలయంలో శ్రీ రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అట్లాగే ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రేశ్వరునికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. మొదటగా ఆలయానికి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు చేసిన తర్వాత అర్చకులు తీర్థప్రసాదాలు శేష వస్త్రాలు మహాదశీర్వాచనం అందజేశారు. అనంతరం సిద్దేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు చేశారు పరమశివుడు రాష్ట్ర ప్రజలను సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివరాత్రి ఉపవాస పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్న భక్తులకు ఆ దేవ దేవుని ఆశీర్వాదం ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నారు. చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందిన వెయ్యి స్తంభాల గుడి అభివృద్ధికి కృషి చేస్తాను అని అన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వేయి స్తంభాల గుడిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక పూజలు:**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండలోని వేయి స్తంభాల గుడిలో రుద్రేశ్వరుని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రికి ఉదయాన్నే ముక్కులు చెల్లిస్తానని, ప్రతి శివాలయంలోనీ శివ నామాన్ని స్మరిస్తూ మొక్కులు చెల్లించిన తర్వాతే సాయంకాలం భోజనం చేస్తానని ఆయన అన్నారు.

# భక్తులకు దాహార్తి తీర్చిన క్లియర్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ పాషా

**- శివరాత్రి సందర్భంగా వాటర్ బాటిల్ పంపిణి**

**- క్లియర్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ ను అభినందించిన వరంగల్ మేయర్**





**తొలిసామయం వరంగల్ ఫిబ్రవరి 26**
మహా శివరాత్రి సందర్భంగా క్లియర్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ పాషా ఆధ్వర్యంలో బుధువారం వరంగల్ పట్టణ కేంద్రంలో మాట్టేవాడ కాలనీ లో భోగేశ్వర స్వామి దేవాలవానికి దర్శనం కొరకై వచ్చిన భక్తులకు దాహార్తి తీర్చడానికి ఎండి పాషా క్లియర్ వాటర్ బాటిల్స్ లను వరంగల్ మేయర్ గుండు సుధారాణి చేతుల మీదగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాటర్ బాటిల్స్ పంపిణి చేసినందుకు క్లియర్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ పాషాను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24 డివిజన్ అధ్యక్షుడు సకినాల రజనీకాంత్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మబ్బు ప్రవీణ్, ఉప్పుల శోభ, మాకు తోట పద్మారావు, బొమ్మ పృధ్వి, రాయబారం జనార్ధన్, ఇంకా తదితర ముఖ్యులు పాల్గొనడం జరిగింది.

# షార్ట్‌సర్క్యూట్‌తో డెకరేషన్ గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం

**సుమారు 10లక్షల మేర సామాగ్రి కాలి బూడిదయ్యాయి**

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థుల వేడుకొలు**





**తొలి సమయం మహబూబాబాద్ జిల్లా గూడూరు ఫిబ్రవరి 26**
భారీ అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో బుధువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గూడూరు మండల కేంద్రనికి చెందిన మెరుగు భరత్ సౌండ్స్ అండ్ డెకరేషన్ టెంట్ హౌజ్ గోడౌన్‌లో తాళం వేసి పనిపై బయటకు వెళ్లారు. అదే సమయంలో విద్యుత్ సర్క్యూట్ తో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు మంటలు చేలరేగడంతో గదిలో ఉన్న ఎల్ఈడీ లైటింగ్‌వైర్లు, సర్వీసు వైర్లు, సౌండ్ సిస్టం తదితర ఎలక్ట్రికల్ సామాన్లు వివిధ సరుకులు కాలి బూడిదయ్యాయి. సుమారు 10లక్షల మేర సామాగ్రి ఉంటుందని ఆ సామగ్రి అంతా అగ్నికి ఆహుతైందని బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

# షార్ట్ సర్క్యూట్‌తో నివాస గృహం దగ్ధం



**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 26**
దంతాలపల్లి మండలం గుండ్లపల్లి గ్రామంలో కరెంటు షార్ట్ సర్క్యూట్ కావటంతో బాష్పాక వెంకటమ్మ నివాసగృహం పూర్తిగా దగ్ధమై ఆస్తి నష్టం జరిగినది. విషయం తెలుసుకున్న దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొరూర్ ఏఎంసి వైస్ చైర్మన్ బట్టు నాయక్ వెంటనే అక్కడికి చేరుకొని గృహాన్ని పరిశీలించి వారి కుటుంబానికి భరోసా కల్పించి ఓదార్చారు వెంటనే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామ్ రెడ్డి మహేందర్ రెడ్డి వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



**తొర్రూరు తొలి సమయం ఫిబ్రవరి 26**
పాలకుర్తి సోమేశ్వర స్వామి వారిని శివరాత్రి పర్వదిన దర్శించుకున్న పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.. ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆటోలో ప్రయాణించడం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని, భక్తులకు సేవ చేయడం తనకు గర్వకారణమని తెలిపారు. అలాగే, ప్రతి ఒక్కరికి శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భక్తులు మరియు పార్టీ నాయకులు కూడా సహకరించి, సమాజంలో శాంతి, భక్తి పట్ల మరింత జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యం ద్వారా, భక్తులకు మంచి అనుభవం కల్పిస్తూ, శివరాత్రి పర్వదినాన్ని మరింత స్మరణీయంగా చేసేందుకు వారి చర్యలు, ప్రజల మధ్య ప్రేమ, సహకారం, మరియు సమాజ సేవను ప్రోత్సహించాయి..

## రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అత్యవసర సహాయం

**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 26**



దంతాలపల్లి మండలం, గున్నేపల్లి గ్రామంలో బాష్పాక వెంకటమ్మ గారి గృహం షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయినది. ఇంటిలో నగదు అన్ని రకాల అత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోయినవి. వీరి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని రెడ్ క్రాస్ సభ్యుడు పొన్నాల ఉమేష్ జిల్లా కార్యవర్గానికి తెలియజేశి కోరినారు. స్పందించిన జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గం బాధిత కుటుంబానికి టార్పొలిన్, దుప్పటి వంట పాత్రలు చీరలు పంచలు 20 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి వరప్రసాద్ కోశాధికారి వెంకట్ రెడ్డి పొన్నాల ఉమేష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కుంభమేళాలో చల్లా దంపతులు



**తొలి సమయం హన్మకొండ ఫిబ్రవరి 26:**
మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ రాజ్ జరుగుతున్న సందర్భంగా గంగా, యమున,సరస్వతి నదుల త్రివేణి సంగమంలో బుధ వారం పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి దంపతులు పుణ్య స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలుపుతూ,ఆ భగవంతుని ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు.

# కృష్ణా డెల్టాకు ఇబ్బంది లేకుండా నీటి సరఫరా

## వేసవిలో పంటలకు సరిపడా నిల్వలు

**అమరావతి,ఫిబ్రవరి26:** కృష్ణా డెల్టా పరిధిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో వేసవిలో నీటి కొరత రాకుండా జలవనరుల శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందని మంత్రి అచ్చన్నాయుడు అన్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా నీటిని ప్రణాళికా బద్ధంగా ఉపయోగిస్తామని అన్నారు. ఉన్ననీటిని సాగు,తాగు నీటి అవసరాలకు వాడుకునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలో సాగులో ఉన్న పంటలకు నీరిస్తూనే... తాగు అవసరాలకు అనుగుణంగా కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో నిల్వ నీటిని సమర్థంగా ఉపయోగిస్తూనే.. వచ్చే ఖరీఫ్‌లో పంటల సాగుకు ప్రారంభంలో నీటి విడుదలకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని అన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్, రబీ సీజన్‌లో పుష్కలంగా సాగునీరు సరఫరా చేశారు. కృష్ణానదికి గతేడాది నీటిప్రవాహం ఉండటం, అవసర మైనప్పుడు గోదావరి నది నీటిని పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోసి ప్రకాశం బ్యారేజీకి తరలించి పంటలకు సాగునీరు అందించారు. సాగునీటి సమస్య లేకపోవడంతో పెట్టుబడి వ్యయమూ తగ్గింది. రబీలోనూ పంటలు పూర్తయ్యే వరకు నీటివిడుదల కొనసాగుతుండటంతో రైతులకు కలిసొచ్చింది. ప్రస్తుతం మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు సాగులో ఉన్నాయి. కాలువల చివర, సముద్రతీర ప్రాంత ఆక్వా చెరువులకు కూడా ఈసారి నీటిసమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికలతో నీటి వనరుల సద్వినియోగంతో అన్నదాతల కష్టాలు తొలగాయని వివరించారు. తూర్పు డెల్టాలోని పంటలు తుదిదశకు చేరుకున్నాయి. ఇక్కడ పెద్దగా సాగునీటి అవసరాలు లేవు. పశ్చిమ డెల్టా పరిధిలో మొక్కజొన్న, జొన్న సాగు ఎక్కువగా ఉండటం, కొంత ఆలస్యంగా రబీలో పంటలు వేయడంతో మార్చి నెలాఖరు వరకు సాగునీటి అవసరాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ 15 వరకు తూర్పు డెల్టా కాలువలకు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరిచ్చేలా రోజువారీ ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. తాగునీటి చెరువులను నింపుతూ నీటి విడుదల ఆపే నాటికి వంద శాతం నీటినిల్వ సామర్థ్యంతో ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తాగునీటి చెరువుల్లో నిల్వ చేసిన నీరు సగటున 90 రోజుల వరకు సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఈలెక్కన జులై నెలలో మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేస్తారు. పులిచింతల ప్రాజెక్టులో సరిపడా నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం నీటివిడుదల కొనసాగుతున్న వాటితో లెక్కిస్తే ఏప్రిల్ 15 నాటికి పులిచింతలలో 20 టీఎంసీల నీరు ఉంటుందని భావిస్తున్నారు. దీనిని నిల్వచేసి రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా నారుమళ్లు వేసుకోవడానికి, వర్షాలు ఆలస్యమైతే తాగునీటి అవసరాలకు అనుగుణంగా విడుదల చేయనున్నారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజీలో వేసవిలో సైతం నీటిని నిల్వ చేయడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలకు లోటుండదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ముందుచూపుతో గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి పులిచింతలలో నీటినిల్వలు తగ్గకుండా చూడటంతో ఇప్పుడు అవసరాలకు పులిచింతల నీరు అక్కరకు వస్తోందని తెలిపారు.

# మెట్రో విస్తరణకు కిషన్ రెడ్డి మోకాలడ్డు

**తనకు పేరొస్తుందనే అడ్డుపుల్లలు వేస్తున్నారు**

**అనుమతులు తీసుకుని వస్తే గండపెండేరం తొడుగుతా**

**కాళేశ్వరంతో లింక్ ఉన్న ముగ్గురు అనుమానాస్పద మృతి**

**కెటిఆర్ వీటిపై ఎందుకు స్పందించడం లేదు**

**ఎఎల్‌బిసి సొరంగం వద్ద సహాయక చర్యలు ముమ్మరం**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి26:** హైదరాబాద్ మెట్రో విస్తరణ అంశం కేంద్ర కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఆరోపించారు. బుధవారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ అంశాలపై స్పందించారు. ప్రధానితో భేటీ సందర్భంగా 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు.'కాళేశ్వరంపై పిటిషన్ వేసిన రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. కేసు వాదించిన సంజీవరెడ్డి అనుమానాస్పదంగా మృతి చెందారు. కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ దుబాయ్‌లో అనుమానాస్పదంగా చనిపోయారు. ర్యాడిసన్ బ్లూ డ్రగ్స్ కేసులో కేదార్ కీలక నిందితుడు. ఈ అనుమానాస్పద మరణాలపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. జ్యుడిషియల్ విచారణ ఎందుకు కోరట్లేదు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల అక్రమాలపై సాంకేతిక నివేదికలు రాకుండా ప్రస్తుతం ఏమీ మాట్లాడను. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న వారిని తీసురావాల్సిన బాధ్యత ఎవరిది? త్వరలో డ్రగ్స్ కేసు విచారణకు రాబోతోంది. రాష్ట్ర విజ్ఞప్తులు ఐదింటికి కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం. కేబినెట్ ఆమోదం తేవాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌లదే. మెట్రో విస్తరణ కేబినెట్ ముందుకు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. కేంద్రానికి విజ్ఞప్తి చేసిన ఐదు ప్రాజెక్టులు సాధిస్తే కిషన్‌రెడ్డికి గండపెండేరం తొడుగుతానని అన్నారు. పదేళ్లుగా ఎస్‌ఎల్‌బీసీ పనులు జరగలేదు. కాంగ్రెస్‌కు పేరొస్తుందనే కేసీఆర్ ఎస్‌ఎల్‌బీసీ పనులు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పనులు మళ్లీ మొదలయ్యాయి. సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు యత్నిస్తున్నాం. ప్రస్తుతం ఎస్‌ఎల్‌బీసీ వద్ద 11 సంస్థలు పనిచేస్తున్నాయి. సొరంగం వద్ద జరిగింది ప్రమాదం. కాళేశ్వరంలో జరిగింది డిజైన్, నిర్మాణ లోపంతో జరిగిన దుర్ఘటన. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి ప్రధాన కారకుడు జైపాల్‌రెడ్డి. కేసీఆర్ వచ్చాక మెట్రో కోసం చేసిందేమీ లేదు. మెట్రో విస్తరణపై కేసీఆర్ పదేళ్లు తాత్సారం చేశారని మండిపడ్డారు. ప్రతి నెలా ఒకటో తేదీకి రూ.22,500 కోట్లు అవసరం. ప్రస్తుతం ఆదాయం రూ.18,500 కోట్లు మాత్రమే ఉంది. జీతాలకు రూ.6,500 కోట్లు, వడ్డీలకు రూ.6,800 కోట్లు చెల్లిస్తున్నాం. ఆదాయం రూ.22వేల కోట్లకు పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం వివరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాపార భాగస్వామి కేదార్ సెలగంశెట్టి మృతిపై అనుమానాలున్నాయని, దుబాయ్ లో ఉన్న ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరో తేలాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన మృతిపై కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేదార్ మరణంతో లింకు ఉన్న డ్రగ్స్ కేసును బయటికి తీసి విచారణ చేస్తామని సీఎం చెప్పారు. త్వరలోనే కేదార్ మృతదేహం ఇండియాకు రానుందని అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మూడు అనుమానస్పద మరణాలు సంభవించాయని చెప్పారు. డ్రగ్స్ కేసుతో సంబంధం ఉన్న కేదార్, కాళేశ్వరం కేసులు వాదిస్తున్న అడ్వొకేట్ సంజీవ రెడ్డి, కేసు వేసిన రాజలింగమూర్తి మృతి చెందారని, వాటిపై కేటీఆర్ న్యాయవిచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ బీజేపీ గెలుపుకోసం పనిచేస్తోందని అన్నారు. సిబిఐ కేసులు అడ్డం పెట్టుకొని బీఆరెస్ ను విలీనం చేసుకోవాలని ఆలోచనలో బీజేపీ ఉందని సీఎం చెప్పారు. ఫార్ములా ఈ, గొర్రెల పంపిణీ కేసులో కేసులో ఈడీ ఇన్వాల్వ్ అయిందని, ఎందుకు చర్యలు తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు మానిటరింగ్ చేస్తోందని, విదేశాల్లో ఉన్న వారిని తీసుకు రావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం అన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న వారు కూడా అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా.? అని అన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల పై కమిషన్ విచారణ సాగుతోందని చెప్పారు. రాత్రిరాత్రికి తాము ఎవరినీ అరెస్ట్ చేయబోమని, అది తమ విధానం కాదని సీఎం చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కమిషన్లు రావనే ఎస్ఎల్బీసీ పనులను పక్కన పెట్టారని సీఎం అన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎస్ఎల్బీసీని 100శాతం పూర్తిచేసి తీరుతామని చెప్పారు. పెరిగిన అంచనాలతో కలిపి 5000 కోట్ల లోపే ఎస్ఎల్బీసీ పూర్తవుతుందని, దీని ద్వారా మూడున్నర లక్షల ఎకరాలకు నీరందుతుందని చెప్పారు. తాను ప్రధాన మంత్రికి ఐదు విజ్ఞప్తులు చేసి, వినతిపత్రాలు అందించానని, వాటికి నిధులు తీసుకొస్తే బహిరంగ సభ ఏర్పాటు చేసి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కి సన్మానం చేస్తానని సీఎం చెప్పారు. ఆ క్రెడిట్ కూడా వాళ్లే తీసుకోవచ్చిన చెప్పారు. తన పాలన అద్భుతంగా ఉందని, ఎవరి ఫోన్లు వారే వింటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాళ్లు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారని చెప్పారు. తన కేబినెట్ లో అనుభవజ్ఞులైన మంత్రులు ఉన్నారని, వారి శాఖలను వారే సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. కేంద్రానికి ఎంత మొత్తంలో పన్నులు కడుతున్నామో రాష్ట్రాలకు అంతే వాటా రావాలని అన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని కేటీఆర్ చెబుతున్నారని, ఎలా వస్తాయో తనకు అర్థం కావడం లేదని సీఎం అన్నారు. 2014 నుంచి 2014 వరకు( బీఆర్ఎస్ ప్రభుత్వం) ఉన్న శాసన వ్యవస్థే ఇప్పుడు కూడా ఉందని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్ట్ నర్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. మెట్రో విస్తరణ జరిగితే తనకు పేరొస్తుందని అనుకుంటున్నారని చెప్పారు. అందుకే కేసీఆర్ హయాంలో జరగలేదు కాబట్టి ఇప్పుడు కూడా జరగొద్దని భావిస్తున్నారని అన్నారు. అందుకే కేంద్ర కేబినెట్ లో మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని చెప్పారు.

## 1,2 తేదీల్లో అనంత శ్రీగంగమ్మ జాతర

**ఏర్పాట్లై అధికారులతో మంత్రి సమీక్ష**

**మదనపల్లె,ఫిబ్రవరి26:** అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలంలో అనంతపురం గంగమ్మ తల్లిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా.. మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. కాగా.. మార్చి 1, 2 తేదీలలో అనంతపురం శ్రీ గంగమ్మ జాతర జరగనుంది. జాతర సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు, మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత జిల్లా స్థాయి అధికారులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. గంగమ్మ జాతర నిర్వహణ పై ఎన్టీవీ, భక్తి టీవీతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడారు. మార్చి 1, 2 తేదీలలో జరిగే అనంతపురం గంగమ్మ జాతరను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని అందరికీ అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి ప్రసాదాలను అందజేస్తామని చెప్పారు. జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.. గంగమ్మ జాతర విజయవంతం కోసం అధికారులు సహకరించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## ప్రయాగ్‌రాజ్‌లో నాగసాధువులు

**చివరి రోజు భారీగా వచ్చినట్లు గుర్తింపు**

**ప్రయాగరాజ్,ఫిబ్రవరి26:** మహా కుంభమేళా చివరి రోజు కావడంతోభక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 45 రోజుల పాటు జరుగుతున్న ఈ వేడుకకు ఇప్పటివరకు 65 కోట్లమందికిపైగా భక్తులు హాజరయ్యారు. చివరి రోజు మహాశివరాత్రి సందర్భంగా నాగ సాధువులు కాశీ విశ్వనాథ ఆలయం వైపు వెళ్లి శివుడికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందుకు సంబంధించిన దృశ్యాలను డ్రోన్ విజువల్స్ ద్వారా షూట్ చేశారు. ఈ వీడియోలో ఒకేసారి అనేక మంది సాధువులు ఒక్కసారిగా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంటోంది. ఇది ఆధ్యాత్మికంగా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పవచ్చు. నాగ సాధువులు కుంభమేళా ముగిసిన తర్వాత, తమ ఆధ్యాత్మిక సాధన కొనసాగించడానికి మళ్లీ హిమాలయాలకు తిరిగి వెళతారు. నాగ సాధువులను సాధారణంగా హిందూ సన్యాసులుగా పరిగణించబడతారు. వీరు సాధారణ జీవనం వదిలేసి ఆధ్యాత్మికతను పాటిస్తూ కఠినమైన ధ్యానం, యోగా, ప్రార్థనలను చేస్తారు. అయితే ఈసారి మహా కుంభమేళా ముగుస్తున్న తరుణంలో మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాలను కూడా ఇక్కడ తెలుసుకుందాం. వచ్చే ఐదేళ్లలో హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్, ప్రయాగ్ రాజ్ ప్రాంతాల్లో కుంభమేళా జరగనుంది. 2027లో హరిద్వార్‌లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు. అర్ధ కుంభమేళా అంటే ఆరేళ్లకు ఒకసారి వస్తుంది. పూర్ణ కుంభమేళా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. చివరి అర్ధ కుంభమేళా 2021లో హరిద్వార్‌లో జరిగింది. ఈ క్రమంలో 2027లో అర్ధ కుంభమేళా నిర్వహించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. మరోవైపు 12 ఏళ్ల తర్వాత వస్తున్న పూర్ణ కుంభమేళా ఈసారి 2027లో నాసిక్‌లో జరగనుంది. తర్వాత మహా కుంభమేళా 2169లో ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమం జూలై 17, 2027న ప్రారంభమై, ఆగస్టు 17, 2027న ముగియనున్నట్లు తెలుస్తోంది. ఇది నాసిక్ నుంచి సుమారు 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర్‌లో జరగనుంది. 2028లో 12 ఏళ్లకు ఒకసారి జరిగే పూర్ణ కుంభమేళా ఉజ్జయినిలో జరగనుంది. ఆ తర్వాత 2030లో ప్రయాగ్‌రాజ్ లో అర్ధ కుంభమేళా నిర్వహించనున్నారు.

## వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే వారి కోసం సర్వే

**ఉపాధి అవకాశాలు పెంచేలా వివరాల సేకరణ**

**అమరావతి,ఫిబ్రవరి26:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ప్రతి రంగంలోనూ కొత్తఆలోచలనతో ముందుకెళ్తోంది. 'స్వర్ణాంధ్ర విజన్-2047, బ్రాండ్ ఏపీ' లక్ష్యంగా దూసుకెళ్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు అందిస్తోంది. ప్రతి ఒక్కరికీ ఏదో ఓ మంచి చేయాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి అడుగులు వేస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు అర్హులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించేందుకు తాజాగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇంట్లో ఖాళీగా ఉండకుండా మహిళలకు పని కల్పించే లక్ష్యంతో వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ మరింత విస్తరించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు సంబంధించి తాజాగా సర్వే చేపట్టింది. ప్రతి ఇంట్లో 18 నుంచి 50 ఏళ్ల లోపు ఉన్నవారి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు సేకరిస్తున్నారు. టెక్నికల్ స్కిల్స్, విద్యార్హతలు సహా ప్రస్తుతం చేస్తున్న పనికి సంబంధించిన వివరాలనూ తెలుసుకుంటున్నారు. అలాగే వారికి వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలపై ఆసక్తి ఉందా, లేదా? అనే అంశాలనూ ఆరా తీస్తున్నారు. ఇప్పటికే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నవారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. వారికి ఉన్న ఇబ్బందులు ఏంటి?, వర్క్ ఫ్రమ్ హోమ్‌లో వచ్చే సమస్యలు ఏంటి? అనే అంశాలనూ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు సైతం ఏపీ సర్కార్ సిద్ధం అవుతోంది. ఒకే ప్రాంతంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న 20 నుంచి 25 మందికి కలిపి సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు ప్రైవేటు భవనాలు అందుబాటులో ఉన్నాయా, లేదా? అనే అంశాన్నీ పరిశీలిస్తోంది. కాగా, మార్చి 10 వరకూ సర్వే చేసి అనంతరం డేటాను ప్రభుత్వానికి పంపనున్నారు ఉద్యోగులు. సర్వే రిపోర్టు వచ్చిన తర్వాత రాష్ట్ర యువతకు మరిన్ని వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు సర్కార్ కృషి చేయనుంది. సర్వే అనంతరం ప్రముఖ కంపెనీలతో సమావేశమై వర్క్ ఫ్రమ్ హోమ్ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రచించనుంది. ఈ మేరకు బ్రాండ్ బ్యాండ్ కనెక్టివిటీ, స్పీడ్ ఇంటర్నెట్, తగిన వసతి కల్పనపైనా దృష్టి సారిస్తోంది. సర్వే తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ఎక్కువ మంది ఆసక్తి చూపితే ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

## ఆధారలతో మాట్లాడినా అడ్డుకున్నారు

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి**

**అమరావతి,ఫిబ్రవరి26:** తాను అన్ని ఆధారాలతో మాట్లాడుతుంటే బెదిరిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు.. శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తుంటే అధికార పార్టీ సభ్యులు తట్టుకోలేకపోతున్నారన్న ఆయన.. ఆధారాలతో సహా మాట్లాడుతుంటే.. బెదిరిస్తున్నారని ఫైర్ అయ్యారు.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విద్యారంగ సమస్యలను ప్రస్తావించాను.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 17 మంది వైస్ ఛాన్సలర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వైస్ ఛాన్సలర్ల ఛాంబర్ ల లోకి వెళ్లి మరీ బెదిరించారని ఆరోపించారు.. ఇద్దరితో మాత్రం రాజీనామా చేయించలేదు.. వీరిలో ఒకరు వారి సామాజిక వర్గానికి చెందినవారు.. మరొకరు మంత్రి అచ్చెన్నాయుడు మిత్రుడికి సంబంధించినవారిని తెలిపారు.. గతంలో ఎప్పుడు ఇలా జరగ లేదన్నారు. బెదిరించి రాజీనామా చేయించారని నేను ఆరోపించారు.. బెదిరించినట్లు ఆధారాలు ఇస్తే జుడిషియల్ విచారణ వేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ కోరారు.. ఆధారాలు ఇస్తామంటే పట్టించుకోలేదని విమర్శించారు చంద్రశేఖర్‌రెడ్డి.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే రాజీనామా చేసామని కొందరు వైస్ ఛాన్సలర్లు లేఖలో పేర్కొన్నారని గుర్తుచేశారు.. అన్ని ఆధారాలూ మంత్రి లోకేష్ కు ఇస్తాం.. వాటిని చూసైనా న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి.. కాగా, శాసన మండలి వేదికగా.. మంగళవారం రోజు వీసీ రాజీనామాలపై వైసీపీ, కూటమి ప్రభుత్వం.. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ మంత్రి చర్చ హాట్ హాట్ గా సాగిన విషయం విదితమే..

# జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన

**- దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి26:** నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ తెలిపారు.

దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని కేటీఆర్ ప్రశ్నించారు. 'జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం' అని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్ మరియు బిహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయి, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి' అని కేటీఆర్ వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తర రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపాదికగా తీసుకోవాలని కేటీఆర్ ప్రతిపాదించారు. 'తెలంగాణ జనాభా దేశ జనాభాలో కేవలం 2.8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5.2 శాతం కంటే ఎక్కువ సహకారం అందిస్తోంది. ఇదే విధంగా దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయి. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని కేటీఆర్ సూచించారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

**సాయంత్రం 7 గంటలకు వెళ్లాల్సిన విమానం 10:30 వెళ్లిన వైనం**

**హైదరాబాద్,ఫిబ్రవరి26:** శంషాబాద్ విమానాశ్రయంలో సరైన సమయానికి గమ్యస్థానాలకు చేర్చాల్సిన విమానాలు ఇలా ఆలస్యం అవడం పట్ల ప్యాసింజర్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా.. మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ప్రయాగ్‌రాజ్ వెళ్సిన స్పైస్‌జెట్ విమానం ఆలస్యం అవడమే ఇందుకు కారణం. స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో మూడు గంటలుగా విమానం కోసం ప్రయాణికులు ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి. మూడు గంటలు అవుతున్నప్పటికీ విమానం ఇంకా బయలుదేరకపోవడంపై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ముఖ్యంగా ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన ప్రయాణికులు విమానం ఆలస్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్పైస్ జెట్‌లో సాంకేతిలోపం తలెత్తిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సిబ్బంది ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రయాగ్రాజ్ వెళ్లే ప్రయాణికులు మండిపడుతున్నారు. కాగా.. ఇదే నెలలోనే ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానం ఐదున్నర గంటల పాటు ఆలస్యంగా నడిచిన విషయం తెలిసిందే. ఈనెల 7న హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాల్సిన విమానం ఆలస్యం అవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఉదయం 10:30 గంటలకు బయలుదేరాల్సిన దాదాపు ఐదున్నర గంటలు ఆలస్యమైంది. ఐదు గంటల పాటు విమానాశ్రయంలో ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికుల్లో హీరో విజయదేవరకొండతో పలువరు సినీ ప్రముఖులు ఉన్నారు. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు, ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులు కూడా ఉన్నారు. అయితే కనీస సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి వెయిట్ చేయించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు రోజు కూడా టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వెళ్లిన విమానం ఇంజిన్ మొరాయించడంతో నిలిచిపోయింది. గుహవాటి వెళ్లాల్సిన ఇండియర్ ఎయిర్‌లైన్స్ విమానం రన్‌వే పైకి వచ్చి టేకాఫ్ అవుతున్న సమయంలో ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గమనించిన పైలెట్ వెంటనే ఏటీసీ అధికారులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఇంజనీరింగ్ నిపుణులు అక్కడకు చేరుకుని దాదాపు గంట పాటు శ్రమించి లోపాన్ని సరిచేశారు. ఆ తరువాత విమానం గుహవాటికి బయలుదేరి వెళ్లింది. అయితే రన్‌వేకు పైకి వెళ్లిన విమానం తిరిగి పార్కింగ్ బే వైపు రావడంతో ప్రయాణికులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే తిరిగి గంటన్నర ఆలస్యంగా విమానం బయలుదేరడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# వేములవాడలో అభివృద్ధి పనులు కొనసాగించాలి

**- ప్రభుత్వాలు మారినా పనులు ఆగొద్దు - వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత**

**వేములవాడ,ఫిబ్రవరి26:** అభివృద్ధి పనుల విషయాల్లో రాజకీయాలు చేయొద్దని, ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనులు ఆపొద్దని ఎమ్మెల్సీ కవిత సూచించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కవిత దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.250 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి ఆగవద్దని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరగడం లేదని స్థానికులు చెబుతున్నారని, కాబట్టి అక్కడ అభివృద్ధి పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం లేదని, తద్వారా సిరిసిల్ల మళ్లీ ఉరిసిల్లగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని నియోజకవర్గాలను ప్రభుత్వం సమానంగా చూడాలని సూచన చేశారు. సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ వేధింపులు ఎక్కువయ్యాయని, కేటీఆర్ ఫోటో పెట్టుకున్నందుకు టీ స్టాల్‌ను తీసేయించిన దుర్మార్గపు ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఇంత భేదభావం అక్కరలేదని, తక్షణమే ఇట్లాంటి కక్షపూరిత వ్యవహారాలను విరమించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# పారదర్శక పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ - అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు**

**- 112 పోలింగ్ స్టేషన్లలోనూ వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు - ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,ఫిబ్రవరి26:** కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను తావులేకుండా, పారదర్శకంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ లక్ష్మీశ సందర్శించి, పక్రియను పరిశీలించారు. చెక్ లిస్ట్ ప్రకారం సామగ్రి అందుతోందో.. లేదో చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 112 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు విజయవాడ, తిరువూరు, నందిగామలోని డిస్టిబ్యూషన్ కేంద్రాల ద్వారా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ మెటీరియల్‌కు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేదని.. 18 రూట్లలో సిబ్బందిని, మెటీరియల్‌ను తరలించేందుకు వాహనాలు, భద్రతా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. 78,063 మంది ఓటర్లు ఉన్నారని.. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామని.. పోలీసు శాఖ ఆధ్వర్యంలో 450 మంది పోలీసు సిబ్బందితో పాటు తక్షణ స్పందన బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి, సందేహాలను నివృత్తి చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. పోలింగ్ స్టేషన్లలోని పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సజావుగా పోలింగ్ జరిగేలా చూడటం జరుగుతుందన్నారు. ఈవీఎం కాకుండా బ్యాలెట్ పేపర్‌తో ఎన్నిక జరగనున్నందున సిబ్బందికి రెండుదశల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల నిర్వహణపై సమగ్ర శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పటిష్ట భద్రతతో బ్యాలెట్ బాక్సులను స్టాం÷-రగ్ రూమ్‌లకు చేర్చడం జరుగుతుందని తెలిపారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ

**కామారెడ్డి,ఫిబ్రవరి26:** గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్కేంద్రాల్లో సామగ్రిని పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోని డిస్టిబ్ర్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డిలో డిస్టిబ్ర్యూషన్ సెంటర్లలో బుధవారం సామగ్రిని పంపిణీ చేసారు. ఎన్నికల సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 29 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు 16,410 మంది, టీచర్? ఓటర్లు 2,011 మంది ఉన్నారని తెలిపారు.

## ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

**నిజామాబాద్,ఫిబ్రవరి26:** టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు జరిగే ఎన్నికలకు చర్యలు తీసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పరిశీలించారు. కలెక్టరేట్ లోరెండు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పక్రియ కొనసాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ విధుల్లో పాల్గొనే టీచర్లు, గ్రాడ్యుయేట్లు మొత్తం 255 మందికి పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వగా, 195 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ డ్యూటీ వేసిన లెటర్, ఐడీ కార్డును పరిశీలించాక ఓటు వేసేందుకు అనుమతించారు. పోలీస్ బందోబస్తు మధ్య ఓటింగ్ సమాగ్రిని తరలించారు.

## శ్రీకాళహస్తికి పోటెత్తిన భక్తులు

**స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం**

**హాజరైన స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి**

**తిరుపతి,ఫిబ్రవరి26:** శ్రీకాళహస్తి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. క్యూలైన్లలో భారీగా భక్తులు బార్లు తీరారు. .బుధవారం తెల్లవారుజాము ఒంటిగంట నుంచే ఆలయ అధికారులు భక్తులకు దర్శనాన్ని కల్పిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయంలో అన్ని రకాల ఆర్జిత సేవలను అధికారులు రద్దు చేశారు. మహా లఘు దర్శనానికి మాత్రమే పరిమితం చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఆలయానికి చేరుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి తొలుత దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఈవో బాపిరెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్థానిక శాసన సభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి స్వామివారికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించి.. స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్వామివారి దర్శనార్థం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని తెలిపారు. భక్తుల మనోభావాలను కాపాడటానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాత్రి ఒంటిగంటకు మహా లింగోద్భవం జరుగుతుంది. సామాన్య దర్శనంతో పాటు రూ. 200, 500 రూపాయల ప్రత్యేక దర్శనాలను అధికారులు ఏర్పాటు చేశారు. స్వామివారి దర్శనం కోసం రెండు గంటల సమయం పడుతోంది. మహాశివరాత్రి నేపథ్యంలో 13 రోజులపాటు ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల కారణంగా శ్రీకాళహస్తి విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా విరాజిల్లుతోంది. శ్రీకాళహస్తి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడా విమర్శలకు తావు లేకుండా శ్రీకాళహస్తి ఆలయంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులేనని, సామాన్య భక్తులను దృష్టిలో పెట్టుకొని కొత్త మార్పులు చేశామన్నారు. గతంలో మాదిరి రాజకీయ స్వార్థంతో కాకుండా భక్తులందరికీ ఒకే రకమైన దర్శన భాగ్యం కల్పిస్తున్నా మన్నారు. ఇకపై ప్రతి ఏటా ఇలాంటి పద్ధతినే శ్రీకాళహస్తి ఆలయంలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గతంలో వైసీపీ ఎమ్మెల్యే లాగా ఆలయంలో తిష్ట వేసుకొని అయిన వారికి దగ్గరుండి దర్శనాన్ని కల్పించే పద్ధతికి తాను స్వస్తి పలకడమే మార్పుకు కారణమని చెప్పారు. ఈ ఏడాది ఆలయంలో కొనసాగుతున్న మహాశివరాత్రి దర్శనాలపై భక్తులందరూ చాలా సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శివనామస్మరణతో మారుమోగిపోతోంది. భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు.

## మద్యం ప్రియులకు జడ్జి సరికొత్త శిక్ష

**నంద్యాల,ఫిబ్రవరి26:** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పోలీసులకు పట్టుబడిన వారికి నంద్యాల జిల్లా బనగానపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సరికొత్త శిక్ష విధించింది. మద్యం అనర్థాలు, రహదారి నిబంధనలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో నిల్చోవాలని తీర్పునిచ్చింది. పలు గ్రామాలకు చెందిన 47 మంది మద్యంప్రియులను గుర్తించి న్యాయస్థానం ఎదుట పోలీసులు హాజరుపరి చారు. వారిలో పరివర్తన కోసం న్యాయమూర్తి షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఈ ఉత్తర్వులిచ్చారు.

## మహాశివరాత్రి రోజు విషాదం

**గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురుల గల్లంతు**

**కాకినాడ,ఫిబ్రవరి26:** మహాశివరాత్రి రోజు తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో విషాదం చోటుచేసుకుంది. గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందారు. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపో వడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101